నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | జనవరి 5, 2024 | www.navatelangana.com

చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి సంవత్సరం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని డీఈఓ ప్రణీత అన్నారు. గురువారం డీఈఓ కార్యాలయంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. పాఠశాల స్థాయిలో ఈ నెల 19న, మండల స్థాయిలో 27న, జిల్లాస్థాయిలో ఫిబ్రవరి 3న టెస్టులు నిర్వహిస్తామని జేవీవీ బాధ్యులు తెలిపారు. టెన్త్ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు.



జాన్వీ విజన్ కేర్ అధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు

నవతెలంగాణ-కౌటాల

ఇటీవల బెల్లంపల్లిలో కంటి ఆపరేషన్లు చేసుకున్న పలువురు గురువారం ఇండ్లకు చేరుకున్నారు. మండల కేంద్రంలోని జాన్వీ విజన్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ కొత్తపేట సహకారంతో చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాలకు చెందిన సుమారు 250మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్ అవసరమైన 20మందిని బెల్లంపల్లికి పంపించారు. అక్కడ ఆపరేషన్ చేయించుకొని తిరిగొచ్చారు. ప్రతి మంగళవారం జాన్వీ విజన్ కేర్ ఆస్పత్రిలో జేఆర్ సర్కార్ ఛారిటబుల్ ట్రస్టు ఆర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామని ట్రస్టు చైర్మన్ నారాయణ్ సర్కార్, వైద్యురాలు సీమ సర్కార్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.



ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా వంటావార్పు

- పోరాటానికి మద్దతు తెలిపిన సీపీఐ(ఎం)
- పనులు ఆపేదాక ఉద్యమం : నాయకులు





ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలని దిలావర్‌పూర్ మండల వాసులు రెండు నెలలుగా నిరసన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. అందులో భాగంగా గురువారం గ్రామ స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చారు. అన్ని వ్యాపార సముదాయాలు, పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా మూసివేసి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో చర్చి ఆవరణలో వంటావార్పు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవతెలంగాణ-దిలావర్‌పూర్

పూర్తి వివరాలు..మెయిన్‌లో...

జన్ మన్ లబ్ధిదారులు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రధానమంత్రి జన్ మన్ కొరకు అర్హులైన లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు వివరాలను అప్డేట్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లాలోని చిర్రకుంట గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకునే అర్హులైన లబ్ధిదారులు అందరూ ఆధార్ కార్డులో తమ వివరాలను అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. ఇందు కొరకు ఆధార్ నమోదు కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయడం జరిగిందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు.

పలు క్రీడా పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు స్టేట్ గేమ్ ఫెడరేషన్ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 3న ఆసిఫాబాద్‌లో జరిగిన అండర్-14 బాలికల సాఫ్ట్ బాల్ పోటీల్లో ఏడవ తరగతి చదువుతున్న నిత్యశ్రీ, గనశ్రీ, అలాగే మహబూబ్‌నగర్‌లో జరిగిన 67 ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలుర బాలికల హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న అశ్విత ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బీవి ప్రేమరాణి విద్యార్థినులకు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆటల పోటీలో రాణించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సహా ఉపాధ్యాయులు తిరుమల, సఫియా, పిఈటీలు శారద, రమ్య పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ ఎఫ్ఎల్‌సి లోక రామ్‌రెడ్డి అన్నారు. గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని పిట్ట బొంగరం గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎడిసిసి బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్, జన్ దన్ ఖాతా తదితర సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నామమాత్రం డబ్బుతో ఇన్సూరెన్స్ చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ మెస్రం కోసేరావ్, సర్పంచ్ వెట్టి గంగారాం పాల్గొన్నారు.

ప్రజాపాలన కార్యక్రమాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - బెజ్జూరు

మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూస శంకర్, నాయకులు రాజారాం, హకీమ్, శైలేష్, వినోద్, విష్ణుమూర్తి, గంగారాం, కృష్ణ పాల్గొన్నారు.



లోక్‌సభ బరి..ఆశావాహుల గురి..!

- పోటీలో నిలిచేందుకు పలువురి ఆసక్తి
- ప్రధాన పార్టీల్లో మొదలైన టికెట్ల వేట
- దక్కించుకునేందుకు నేతల విశ్వప్రయత్నాలు
- జిల్లాలో రసవత్తరంగా మారుతున్న పరిణామాలు

రానున్న లోక్‌సభ ఎన్నికలపై అన్ని ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఎంపీ బరిలో నిలిచేందుకు పలువురు కీలక నాయకులు ఆసక్తి చూపుతున్నారు. ప్రధాన పార్టీల నుంచి టికెట్లు దక్కించుకునేందుకు పలువురు నాయకులు విశ్వ ప్రయత్నాలు చేయడం ఆసక్తికరంగా మారుతోంది. ముఖ్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మరోసారి ఆదిలాబాద్ సిట్టింగ్ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని భావిస్తుండగా.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ స్థానాన్ని కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. మరోపక్క రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ సైతం ఎంపీ స్థానంలో గెలిచి పట్టు సాధించాలని అనుకుంటోంది. ఇలా ప్రధాన పార్టీలు ఎవరికి వారు లోక్‌సభ ఎన్నికలపై దృష్టిసారించడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఆయా పార్టీల నుంచి బరిలో నిలిచేందుకు పలువురు మాజీ ప్రజాప్రతినిధులతో పాటు కొత్తవారు సైతం ఆసక్తి చూపిస్తున్నారు.



ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో పదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఉమ్మడి జిల్లాలో తొలిసారి ఏకంగా నాలుగు స్థానాలు దక్కించుకుంది. ఇక రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ జిల్లాలో మెజార్టీ సీట్లు దక్కించుకోకపోయినా..నాలుగింట విజయం సాధించింది. బీఆర్ఎస్ కేవలం రెండింటికి మాత్రమే పరిమితమైంది. దీంతో రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ మూడు ప్రధాన పార్టీల మధ్య తీవ్రమైన పోటీ ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో మూడు పార్టీల నుంచి టికెట్లు ఆశించే వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ నుంచి అధికంగా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో పాటు కేంద్రంలోనూ అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఆరాటపడుతోంది. దీంతో పార్టీ తరపున గెలిచే అభ్యర్థిని బరిలో నిలపాలని భావిస్తోంది. మరోపక్క బీజేపీ మూడోసారి గెలిచి అధికారాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఇక జాతీయ పార్టీగా అవతరించిన బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పొందినా..లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తుండటం ఆసక్తికరంగా మారింది.

టికెట్ల కోసం ప్రయత్నాలు..!

ప్రధాన పార్టీల నుంచి టికెట్లు దక్కించుకునేందుకు అనేక మంది ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి వారు ఆయా పార్టీల అధిష్టానాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్య నాయకులను ప్రసన్నం చేసుకుంటూ టికెట్ కేటాయించాలని అభ్యర్థిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి ఏఐసీసీ సభ్యుడు నరేష్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌తో పాటు త్వరలో రోజుల్లో కాంగ్రెస్‌లో చేరబోతున్న ఆదిలాబాద్ జడ్పీ ఛైర్మెన్ రాథోడ్ జనార్ధన్ సైతం టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు ఓ మాజీ ఎమ్మెల్యేను సైతం కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చి టికెట్ ఇప్పించే ప్రయత్నం జరుగుతున్నట్లు సమాచారం. ఇక బీజేపీ నుంచి సిట్టింగ్‌లకే మళ్లీ టికెట్లిస్తామని ఇటీవల అమిత్‌షా ప్రకటించడంతో మరోసారి సోయం బాపురావు ఆ పార్టీ నుంచి బరిలో ఉంటారని ప్రచారం జరుగుతోంది. ఏమైనా పరిణామాలు సంభవిస్తే ఇతరులు కూడా రంగంలో దిగే అవకాశం ఉంటుంది. ఇక బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును బరిలో నిలిపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే సక్కుకు ఆ పార్టీ అధిష్టానం ఎంపీ టికెట్ హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. దీంతో ఆత్రం సక్కు లేదంటే ఇతరులను బరిలో నిలిపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. వీరితో పాటు ఆయా పార్టీల నుంచి పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, జిల్లాకు చెందిన వివిధ హోదాల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా ప్రధాన పార్టీల నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులు సిద్ధం కావడం ఉమ్మడి జిల్లా రాజకీయాలను ఆసక్తికరంగా మారుస్తోంది.



ఆర్మూర్ రైల్వేలైన్ పూర్తి కొరకు బడ్జెట్ కేటాయించాలి

- 11న రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ రైల్వేలైన్ పూర్తి కొరకు బడ్జెట్ కేటాయించాలని ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ నారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతమైన ఆదిలాబాద్ గడిచిన 10 సంవత్సరాల నుండి ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. తెలంగాణలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుండి ఎన్నడూలేని విధంగా బీజేపీకి మద్దతు లభించిందని, గత పార్లమెంటు ఎన్నికల్లో కూడా ఇక్కడి నుండి ఎంపీని గెలిపించారని తెలిపారు. కాని ఆదిలాబాద్‌లో ప్రధాన సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 11న సెంట్రల్ గార్డెన్‌లో మధ్యాహ్నం సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాకు ఐఐటీ, నవోదయ విద్యాలయం కేటాయించాలన్నారు. గిరిజన యూనివర్సిటీ కేటాయించాలని లేదా రీజినల్ సెంటర్ కేటాయించాలని డిమాండ్ చేశారు. బేల కేంద్రంగా బాజీరావు బాబా మారాఠి యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్నారు. టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్ పోర్టు లేదా ఎయిర్ స్ట్రిప్ వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి జిల్లా కో కన్వీనర్ నరేందర్, సభ్యులు గణేశ్, మహేందర్, ముబారక్, శ్రీనివాస్, నాందేవ్ పాల్గొన్నారు.

జన్ మన్ పథకం ద్వారా గిరిజనుల అభివృద్ధికి కృషి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా పిటిజి గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి తహసీల్దార్లు, వైద్య ఆరోగ్యశాఖ, బ్యాంకింగ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులతో ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద ఆదివాసీ పిటిజి గిరిజనుల అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి జన్ మన్ పథకం విజయవంతం చేయడం కోసం సంబంధిత 10 శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రతి పిటిజి గిరిజన కుటుంబంలో అందరికీ ఆధార్ కార్డులు, పక్కా ఇండ్లు, ప్రతి ఇంటికి నల్లా, విద్యుత్ కనెక్షన్లు, ప్రతి గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం, విద్య శిక్షణకు వసతి గృహాలతో పాటు సుదూర మారుమూల ప్రాంతాలకు సంచార వైద్య సదుపాయం, అందరికీ పోషకాహారం ఇతర అన్ని సౌకర్యాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గిరిజనులకు ఉన్నత జీవన సౌకర్యం, ప్రతి గ్రామానికి ఫోన్ సౌకర్యం కల్పించాలని, మల్టీపర్పస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, భారత గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జన్ మన్ పథకం నిర్వహణ కొరకు సంబంధిత శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే ఆలంబనంగా దివ్యాంగులు ముందుకు సాగాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆత్మవిశ్వాసమే ఆలంబనంగా దివ్యాంగులు ముందుకు సాగాలని, ప్రభుత్వ పరంగా అవసరమైన తోడ్పాటునందిస్తామని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ 215వ జయంతిని గురువారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ శ్యామలదేవి ముఖ్యఅతిథిగా హాజరై ముందుగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంధులు చదువుల్లో రాణించాలనే లక్ష్యంతో లూయిస్ బ్రెయిలీ వారి కోసం ప్రత్యేక లిపిని సృష్టించారన్నారు. ప్రస్తుతం అంధులు చదువుకుంటూ ప్రభుత్వ కొలువులు సాధిస్తున్నారన్నారు. దివ్యాంగులు కూడా సవ్యాంగులకు ధీటుగా రాణించడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని, దాన్ని బయటకు తీయాలని సూచించారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో అంధుల కోసం 7వ తరగతి వరకే పాఠశాల ఉందని, దాని ఉన్నతీకరణకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి నివేదిస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో మిల్కా, అంధుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.భీమ్‌రావ్ అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆదిలాబాద్ డిపో కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఆర్టీసీ కార్మికుల ప్రభుత్వ విలీన ప్రక్రియ పూర్తి చేయాలని, కార్మికులకు రావాల్సిన రెండు పీఆర్సీలను, బాండ్ డబ్బులను ఇతరత్రా ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకంతో బస్సులో ప్రయాణికుల సంఖ్య పెరగటం వల్ల తెలంగాణ మహారాష్ట్ర మధ్య నడిచే బస్సులలో ఒక్క ప్రయాణికునికి రెండు టికెట్లు ఇవ్వడం జరుగుతోందని, దీనివల్ల కండక్టర్‌కు చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఒకే టికెట్ ను ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. మహాలక్ష్మి టికెట్‌పై ప్రయాణించే ప్రయాణికులకు గుర్తింపు కార్డుగా దేన్ని ఉపయోగించాలో ఒక స్టిక్కర్ ద్వారా బస్సుల్లో అతికిస్తే బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎం.ఆశన్న, గంగన్న, అశోక్ పాల్గొన్నారు.

సదర్‌మాట్ నీటి విడుదల

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

సదర్‌మాట్ ఆయకట్టుకు గురువారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సాగునీరును విడుదల చేశారు. రైతులు స్వల్పకాలంలో వచ్చే పంటలు వేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ మొదటి వారం వరకు నిరంతరంగా వచ్చే నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. పంట చివరి కాలం వరకు నీటి పారుదల శాఖ అధికారులు రైతులకు సాగునీటి ఇబ్బంధులు తలెత్తకుండా చూడాలని తెలిపారు.



ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, కాంగ్రెస్ నాయకులు గుగ్లావత్ రాజేందర్, దొనికెని దయానంద్, నిమ్మల రమేష్, యూసుఫ్ ఖాన్, తోట సత్యం, కే.గంగనర్సయ్య, కరిపే రాజ్ కుమార్, తిరుపతిగౌడ్, లక్ష్మిరాజం, మజీద్, మీర్జాబేగ్, ఎస్సారెస్పీ ఈఈ రామారావు, డీఈ సురేందర్, జేఈలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర పంచాయతీరాజ్, శిశుసంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)ను, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డిని సమగ్ర శిక్ష ఉద్యోగులు హైదరాబాద్ లోని సెక్రటరియేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగులను క్రమబద్ధీకరించి, మినిమం టైం స్కేల్ అందించాలని తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాగా త్వరలో తమ సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామినిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, మాధవ్, ఉపాధ్యక్షులు దుర్గం శ్రీనివాస్, మెదక్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు, పాషా, నాగార్జున పాల్గొన్నారు.



ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఉట్నూర్

అందుల జీవితలో వెలుగును నింపిన లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలను పట్టణంలోని వికాసం పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, అంద విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. కేకు కట్ చేసి హ్యాపీ లూయిస్ బ్రెయిలీ అంటు ఒకరినొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ వికాస్, పాఠశాల సిబ్బంది భీమేష్, రాథోడ్ అశోక్, గంగామణి, సుజాత, పావని, శ్రీనివాస్, శ్రీను, రాహుల్, నరేష్, శ్రీకాంత్, కిషోర్, సౌజన్య, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రమాబాయి విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ఉట్నూర్

నేతకాని, మహర్ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని లక్కారం గ్రామపంచాయతీ చత్రు నగర్ చౌరస్తాలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి రమాబాయి విగ్రహం నిర్మాణానికై భూమి పూజ చేశారు. ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి నాడే విగ్రహావిష్కరణ కోసం ముమ్మరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు.

మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ గిరిజన ఐటీఐ ఉట్నూర్‌లో సోమవారం 8న ఉదయం 10 గంటలకు కేబీ కాంప్లెక్స్‌లోని ఐటీఐ కళాశాలలో ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ షిప్ మేళా ఉంటుందని, ఐటీఐ చదువుకొని పాస్ ఉన్న ప్రతి ఒక విద్యార్థులు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె. రమేష్ బాబు తెలిపారు. నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చి తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాటు రెండు సెట్‌లు జిరాక్స్ కాపీలు తీసుకోరావాలని పేర్కొన్నారు. అప్రెంటీస్‌ఇండియా.ఓఆర్‌జీలో రిజిస్ట్రేషన్ చేసుకొని రావాలని తెలిపారు. ఇతర వివవరాలకు 9490202037, సంప్రదించాలని పేర్కొన్నారు. విద్యార్థులు తమ వెంట ఆధార్ కార్డు, ఐటిఐ మెమో, పదో తరగతి మెమో, పాన్‌కార్డు, రెండు పాస్ ఫోటో అప్లయ్ చేసినా ఫారాన్ని తీసుకొని సమయానికి హాజరు కావాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-ముథోల్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని గన్నోర, రువ్వి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు వెంకటి, మనోహర్, ప్రభాకర్, నారాయణరెడ్డి, రాములు, దేవన్నతో పాటు 50 మంది కార్యకర్తలు గురువారం భైంసాలో ముథోల్ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి గంగారెడ్డి, ఎంపీటీసీ ఆత్మస్వరూప్, నాయకులు సాయిరెడ్డి, ముత్యంరెడ్డి, బోజారెడ్డి పాల్గొన్నారు.

బంజారా యువ సేన నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఉట్నూర్

బంజారా యువ సేనా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రాథోడ్ సంజీవ్ నాయక్ జిల్లా అధ్యక్షుడిగా చవాన్ నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ మహేందర్, జిల్లా ఉపాధ్యక్షుడిగా చౌహాన్ దయాకర్, జిల్లా కార్యదర్శిగా రాథోడ్ మదన్‌లను ఎక్యగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. నాయకులు సమాజం కోసం పని చేసి సంఘానికి సమాజానికి మంచి పేరు తేవాలని సూచించారు.

జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు



నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని రబింద్ర హైస్కూల్‌లో గురువారం నిర్మల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. దీనికి జిల్లా నలుమూలల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. సుమారు 70 మంది బాలికలు, 130 మంది బాలురు పాల్గొన్నారు. ఐతే ఈ పోటీలో మొత్తం 24 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 14న సిద్దిపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని జిల్లా క్రీడా అధికారి నవేఖాన్ తెలిపారు. క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజేందర్, పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, సెక్రటరీ సునీల్, జాయింట్ సెక్రటరీ కె.రాముగౌడ్, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్, ఆగనిగి సెక్రటరీ ప్రేమలత, పలు పాఠశాలల నుంచి పీఈటీలు, పీడీలు పుష్పలత, సంజీవ్, రాథోడ్ నవీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నాగోబా జాతరలో సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోని ప్రసిద్ధి గాంచిన కేస్లాపూర్‌లోని నాగోబా జాతర వచ్చేనెల 9 న ప్రారంభం కానుంది. ఈ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు ఆదేశించారు. నాగోబా జాతర నిర్వహణపై ముందుగా సంభందిత శాఖల అధికారులతో గురువారం కేస్లాపూర్‌లోని నాగోబా దర్బార్ హాలులో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్‌లు సంయుక్తంగా మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ప్రస్తుతం దేశంలో కోవిడ్ కేసులు నమోదవుతున్నందున ఆరోగ్యశాఖ ముందు జాగ్రత్త తీసుకోవాలన్నారు. జాతరలో వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా మాస్కులను ధరించేటట్లు అవగాహన కల్పించారు. అవసరమైన చోట మొబైల్ టీమ్‌ను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జాతరలో ఆరంభం నుంచి ముగిసే వరకు 24 గంటలు కరెంటును పంపిణీ చేయాలన్నారు. జాతరలో దేవాదాయ శాఖ ద్వారా గత సంవత్సరం రూ.9 లక్షల ఆదాయం రాగా రూ.20 లక్షల వరకు ఖర్చు అయిందని ఈఓ రాజ మౌళి పీఓకు వివరించారు. అదే ఖర్చుతో ఈ సారి కూడా దేవాదాయ శాఖ ద్వారా ఏర్పాట్లు చేయాలన్నారు. దీంతో పాటు ఆలయానికి లైటింగ్ భూసేకరణ, దుకాణాల ట్రైబజార్ వేలం పాటను నిర్వహించాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు మహిళలు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన బస్సులను ఏర్పాటు చేయాలని ఆశాఖకు ఆదేశించారు. జాతర ఆరంభం నుంచి ముగిసే వరకు తాగు నీటి పంపిణీ, అవసరమైన చోట తాగు నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని ఆశాఖకు అప్పగించారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు షీ టీమ్ తదితర బాధ్యతలను డీఎస్పీ నాగేందర్‌గౌడ్‌కు అప్పగించారు. అంతే గాకుండా ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖకు గత సంవత్సరం చేసిన రోడ్డు, టెంట్ల ఏర్పాట్లు చేయాలన్నారు. జాతరలో విధులు నిర్వర్తించే పోలీసులు, ఇతర సిబ్బంది, ప్రెస్ భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని ఐటీడీఏ డీడీకి సూచించారు. సానిటేషన్, తాగునీరు, అవసరమైన చోట తాత్కాలిక మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని ఆ శాఖకు ఆదేశించారు. జాతరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నాగోబా కమిటీ సభ్యులు ఆహ్వానించే అవకాశం ఉన్నందున హెలిప్యాడ్, బారికేడ్ తదితర పనులను ఆర్ అండ్ బి శాఖ సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. ఏది ఏమైనా గత సంవత్సరం నాగోబా జాతరలో చేపట్టిన సౌకర్యాలను ఈ సారి కూడా సంభందిత శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముమ్మర ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాగోబా ఆలయ చైర్మెన్ మెస్రం తుకారాం, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్, పటేల్ వెంకట్ రావ్, డీఆర్డీఓ కిషన్, ఏఓ రాంబాబు, ఈఈ భీమ్‌రావ్, డీఈ సుభాష్, ఆర్డీఓ రెడ్డి, డీపీఓ శ్రీనివాస్, ఫైర్ అధికారి దుర్గం రాజలింగం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎస్పీగా గౌస్ ఆలం గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలను అప్పగించారు. అంతకుముందు నూతన ఎస్పీ గౌస్ ఆలంకు జిల్లా పోలీస్ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి సాదారంగా జిల్లాకు ఆహ్వానించారు. తదుపరి ఇరువురు అధికారులు జిల్లా స్థితిగతులు, పరిస్థితులు, శాంతిభద్రతల అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను నూతన ఎస్పీ గౌస్ ఆలం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.



విద్యార్థులతో కలిసి సర్పంచ్ మధ్యాహ్న భోజనం

నవతెలంగాణ-బేల

మండలంలోని పాటన్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం సర్పంచ్ ఫైజుల్లాఖాన్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మంచి చదువులు చదవాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మయాకర్, పోచ్చన్న, పంచాయతీ కార్యదర్శి సుహాసిని ఆయన వెంట ఉన్నారు.



ఎమ్మెల్యే బొజ్జు పునరావాస గృహాల సందర్శన

నవతెలంగాణ-కడెం

మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామంలో నిర్మిస్తున్నటువంటి పునరావస గృహాలను గురువారం ఖానాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పునరవాస గృహాల నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్మించాలని అన్నారు. అడవుల నుంచి బయటకు వస్తున్న అడవి బిడ్డలకు నాణ్యమైన గృహాలను అందించే బాధ్యత అధికారుల పైన తమ పైన ఉన్నదని పేర్కొన్నారు. అన్ని సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు అందించాలని అధికారులకు సూచించారు. నాసిరకంగా నిర్మిస్తే వాటిపై విచారణ జరిపి, నాసిరకంగా నిర్మించినట్లు రుజువైతే కాంట్రాక్టర్‌కు బిల్లులు విడుదల చేయకుండా శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే త్వరలోనే పంచాయతీరాజ్ ఈఈతో కలిసి పరిశీలిస్తామని తెలిపారు. పునరావాస నిర్వాసితులకు అటవీశాఖ అధికారులు త్వరగా వ్యవసాయ భూమిని కేటాయించాలని కోరారు. అంతకు ముందు నచ్చన్‌ఎల్లాపూర్‌లో నిర్వహిస్తున్నటు వంటి ప్రజాపాలన కార్యక్రమంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం చిన్న బెల్లాల్ గ్రామంలో నిర్వహిస్తున్నటువంటి ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. లబ్ధిదారులు ప్రతిఒక్కరు అర్హత కలిగిన సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో త్వరలోనే 6 గ్యారంటీలను పక్కగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆంటోనీ అలెగ్జాండర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, కొత్త మద్దిపడగ సర్పంచ్ జెడీ రాజమణి ఇందూర్, ఎలగడప ఎంపీటీసీ నర్సింగ్ రమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు గొల్ల వెంకటేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పడగెల భూషణ్, పట్టణ అధ్యక్షులు వాజీద్‌ఖాన్, మండల సీనియర్ నాయకులు బబ్లు, రహీం, తాళ్లపెల్లి రమేష్, జక్కుల సతీష్, రెంకల శీను, కొప్పుల రమేష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

8న సీపీఐ(ఎం) జిల్లా ప్లీనరీని జయప్రదం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఖానాపూర్

సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్మల్‌లోని పార్టీ కార్యాలయంలో 8న నిర్వహిస్తున్నట్టు సీపీఐ(ఎం) ఖానాపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి డాకూరు తిరుపతి అన్నారు. గురువారం ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పి.జ్యోతి, జిల్లా ఇన్‌చార్జీ రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య హాజరవుతున్నారనీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఆరు గ్యారంటీల పేరిట అనేక హామీలు ఇచ్చిందనీ అన్నారు. స్థలం లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఇస్తామని చెప్పడం ఆహ్వానించే అంశమని అన్నారు. వీటన్నింటిపై చర్చించి ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి ప్రజా సమస్యల పరిష్కారాలపై సమావేశంలో చర్చ జరుగుతుందని అన్నారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు, ఖానాపూర్ మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల పర్వం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తుల పర్వం కొనసాగుతుంది. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శేఖర్ కోరారు. గురువారం మండలంలోని బాబాపూర్, రాచపూర్, మునిపల్లి గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని మండల ఎంపీపీ అడ్వాల పద్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలు అందరూ ఎలాంటి తప్పులు దొర్లకుండా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీఓ నసీరుద్దీన్, సర్పంచ్లు శ్రీ విద్య, శాతం బొర్రవ్వ కమల్‌కోట పద్మ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ బూసి ముత్యం, ఎంపీటీసీ బూసి రమ, పంచాయతీ కార్యదర్శులు భాగ్య లక్ష్మి, హరిత, ఇందుమతి, మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్, విద్యుత్‌శాఖ, వైద్య, ఐకేపీ, ఆశా, ఈజీఎస్, పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని నెరవేర్చాలి



నవతెలంగాణ- బేల

విద్యార్థులు స్పష్టమైన ఉచ్చారణ, ధారాలంగా చదవడం, దోషాలు లేకుండా రాయడం వచ్చినప్పుడే ఉన్నత లక్ష్యం నెరవేరినట్లు అవుతుందని డీఈఓ ప్రణీత అన్నారు. గురువారం మండలంలోని సిర్సన్న ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలుగు కాంప్లెక్స్ సముదాయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. తెలుగు భాషలో విద్యార్థులు పట్టు సాధిస్తే మిగితా సబ్జెక్టులను సులభంగా అర్థం చేసుకుంటారన్నారు. బోధనలో తలెత్తుతున్న సమస్యలను చర్చించేందుకు సముదాయ సమావేశాలు దోహదం చేస్తాయని అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు నారాయణ, సుజాత్ ఖాన్, ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, డీఆర్‌పీ చరణ్‌దాస్, ఆర్‌పీ ఉదారి నారాయణ, సీఆర్పి వెంకన్న, బేల, జైనథ్ మండలాల భాషోపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీని ధిక్కరిస్తే చర్యలు తప్పవు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

బీఆర్ఎస్ గుర్తుతో గెలిచిన కౌన్సిలర్లు ఇతర పార్టీ నాయకునికి మద్దతు తెలిపితే చర్యలు తప్పవని ఆపార్టీ మండల అధ్యక్షుడు రాజగంగన్న హెచ్చరించారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మాణ పరీక్షలో బీఆర్ఎస్ సభ్యులు పాల్గొనవద్దని తెలిపారు. పార్టీని దిక్కరించే సభ్యులపై అధిష్టానం సూచన మేరకు క్రమశిక్షణ చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు కే.నారాయణ, రాము నాయక్, ప్రదీప్, గోవింద్, శ్రావణ్ ఉన్నారు.

దేశం అభివృద్ధే తమ సంకల్పం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మా సంకల్పం వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో సమావేశాన్ని నిర్వహించారు. దేశ ప్రజల అందరి సంకల్పం అభివృద్ధి చెందిన భారతదేశమని నినదించారు. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గురించి వివరించారు. ఎరువుల పిచికారీ, పంట సంరక్షణలో డ్రోన్‌ల వినియోగం గురించి, క్లుప్తంగా తెలిపారు. ఆర్థిక స్థిరత, నైపుణ్య అభివృద్ధి గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వికసిత భారత్ బృంద సభ్యులు, సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, వార్డు సభ్యులు అశోక్, చిన్నారెడ్డి, ఆశా సిబ్బంది సుమలత, అంగన్‌వాడీ సిబ్బంది సునీత, ఐకేపీ సిబ్బంది మమత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ఉమ్రి గ్రామపంచాయతీలో గురువారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు గ్యారంటీల దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విఠల్ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఖయ్యూం, తీత్రే గోవింద్, భామన్ సాథిలియ, గైక్వాడ్ భారత్, జాడి కృష్ణ, వివిధ శాఖల అధికారులు, వాలంటీర్లు, గ్రామస్తులు, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించిన డీసీసీ అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ నవతెలంగాణ 2024 క్యాలెండర్‌ను జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రజాస్వామ్యంలో ప్రధానపాత్ర పోషించాలని సూచించారు. ప్రజల సమస్యలు బయటికి తీస్తూ ప్రభుత్వానికి సూచనలు, సలహాలు చేస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మసాడే చరణ్, నవతెలంగాణ రిపోర్టర్ మహేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన విశ్రాంత ఉద్యోగులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబును గురువారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం అభివృద్ధిపై చర్చించి తమ సహకారం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కాగజ్‌నగర్ యూనిట్ అధ్యక్షులు ఎం.జయదేవ అబ్రహం, కార్యదర్శి ఎం.శివ ప్రసాద్, ఏఎస్ఆర్ మూర్తి, భావనపల్లి నర్సయ్య, ఎం.సుభాష్, పురుషోత్తం, రాజేంద్రప్రసాద్, తాజుద్దీన్, ముబషీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గిరిజన పాఠశాల విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అనిత తెలిపారు. గురువారం ఎంపికైన విద్యార్థులు ఆర్తి, కౌసల్యలను పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 17 నుండి 19 వరకు వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు జనవరి 17 నుండి 21 వరకు సెంట్రల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. విద్యార్థుల్లో క్రీడాభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్న తెలిపారు. ఆర్తి, కౌసల్యాలు ఇతర విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. వీరిద్దరూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భద్రకాళి, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల వద్ద మళ్లీ భగీరథ పైపులైన్ లీకేజీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బెండర గ్రామ సమీపంలోని మోడల్ డిగ్రీ కళాశాల వద్ద కళాశాలకు నీటి సరఫరా చేసే పైప్‌లైన్ మళ్లీ లీకేజీ కావడంతో నీరు వృధా అవుతుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కనకయ్య మాట్లాడుతూ తమ కళాశాలకు వస్తున్న భగీరథ నీటి పైప్‌లైన్ ఎప్పుడు పగిలిపోతుండడంతో నీరు అందడం లేదని, శాశ్వత ప్రాతిపదికన నీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నేషనల్ హైవే పనులు నడుస్తున్న నేపథ్యంలో అనునిత్యం పైపులు పగులుతున్నాయని, దీనితో నీరు కళాశాలకు రావడం లేదన్నారు. గతంలో పగిలిన పైపు హైవే అధికారులతో మాట్లాడి బాగు చేయించామని, ప్రస్తుతం అదే పరిస్థితి తలెత్తిందని, వెంటనే అధికారులు స్పందించి పైపులైన్ బాగు చేయించాలని కోరారు.

సావిత్రిబాయి పూలే అవార్డుకు ఎంపికైన వీణకు అభినందనలు

నవతెలంగాణ-కెరమెరి

సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకొని 7న నాగపూర్‌లో దేశ వ్యాప్తంగా వివిధ రంగాలలో కృషి చేస్తున్న 36 మంది ప్రముఖులను శ్రీ క్షత్రియ్ కోసరే మాలీ సమాజ్ విదర్భ ఆధ్వర్యంలో సత్కరించనున్నారు. కాగా ఈ సత్కర కార్యక్రమానికి కడేర్ల వీణ ఎంపికయ్యారు. పదేండ్లుగా సావర్ ఖేడా ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛందంగా విద్యాబోధన చేస్తున్న వీణ ఎంపిక పట్ల అఖిల భారత మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కూలే, మండలంలోని సావర్ ఖేడ ప్రధానోపాధ్యాయులు కడేర్లరంగయ్య, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత

నవతెలంగాణ-వాంకిడి

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా పోలీసులు గుర్తించి బాధితుడికి అప్పగించారు. మండలంలోని కమాన గ్రామానికి చెందిన శ్రీకాంత్ సామ్‌సంగ్ మొబైల్ ఫోన్‌ను ఆరు నెలల క్రితం పోగొట్టుకున్నాడు. అదే రోజు వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌ను ట్రాప్ చేసి సెల్‌ఫోన్‌ను గుర్తించి గురువారం స్వాధీనం చేసుకొని తిరిగి బాధితుడు శ్రీకాంత్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్నా, గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లిన వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సీఈఐఆర్ పోర్టల్ యాప్‌లో పూర్తి వివరాలను నమోదు చేస్తే పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ పోర్టల్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొబైల్ ఫోన్‌ను వెతికి తిరిగి అప్పగించినందుకు శ్రీకాంత్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సదరం శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో జనవరి నెలలో నిర్వహించే సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సురేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూగ, చెవిటి సదరం క్యాంపు ఈ నెల 9న, కంటిచూపుకు సంబంధించి సదరం క్యాంప్ 18న, మానసిక వైకల్యానికి 23న, ఎముకలకు సంబంధించిన సదరం క్యాంప్ 30న జిల్లా ఆస్పత్రిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అయోధ్యలో 22న శ్రీ సీతారాముల ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుండి వచ్చిన అక్షింతలను గురువారం కోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో జనకపూర్‌లో సాంప్రదాయబద్ధంగా ఇంటింటికి పంపిణీ చేశారు. రామ మందిరం ప్రారంభోత్సవానికి సంబంధించిన వివరాలను తెలియజేస్తూ అక్షింతల విశిష్టత, వాడుకునే విధానాన్ని ఆలయ అర్చకుడు వినాయక భక్తులకు తెలిపారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని ఆయా కాలనీలకు సంబంధించిన సభ్యులు శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు దేగల సత్యనారాయణ, కమిటీ సభ్యులు కొండ శంకరయ్య, పసుపునూరి తిరుపతి, శ్రీహరి, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం కోసం కృషి చేస్తా

- ఎమ్మెల్యే పాల్వాయి హరిష్‌బాబు



ప్రజాపాలనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరిష్ బాబు

నవతెలంగాణ-కౌటాల

తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రైతువేదికలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీలపై దరఖాస్తుల స్వీకరణను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పలువురి లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం తుమ్మిడిహేటి వద్ద నిర్మాణం చేపట్టే ప్రాణహిత ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మేడిగడ్డకు తరలించి అక్కడ నాణ్యతలోపం పనులు చేయడంతో బ్యారేజీ కుంగిపోయి ఎక్కడి గొంగళీ అక్కడే అన్న చందంగా మారిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సైతం బ్యారేజీ నిర్మాణానికి ముందుకొస్తుందని, దాని కోసం నేను కూడా కృషి చేసి ప్రాణహిత బ్యారేజీ నిర్మాణం చేపట్టి, ఈ ప్రాంత రైతాంగానికి రెండు పంటలకు నీరందించి బీడు భూములు లేకుండా చేస్తామన్నారు. అదే విధంగా సాండ్‌గాం నుండి రన్‌వెల్లి వరకు నాలుగు ఎత్తిపోతల పథకాలు ఉండగా అందులో సాండ్‌గాం ఒక్కటే పనిచేస్తుందని, వీర్దండి, గుండాయిపేట్, తుమ్మిహేటి, రన్‌వెల్లి ఎత్తిపోతలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎత్తిపోతలుగానే మిగిలాయని, తిరిగి వాటికి మరమ్మత్తులు చేయించి ఎత్తిపోతల పథకాన్ని పనిచేసేలా చేస్తానన్నారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధి కోసం ఎల్లవేళల పనిచేస్తానని, ప్రతి సమస్యను అసెంబ్లీలో లేవనెత్తి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- యూనియన్ గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీవైజ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న 7 నెలల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ అనుబంధ హాస్టల్ డైలీ వేజ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్ ఆధ్వర్యంలో కార్మికులు డీటీడీఓ రమాదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హాస్టల్ వర్కర్లతో వెట్టిచాకిరి చేయించుకుంటుందని విమర్శించారు. నెలల తరబడి వేతనాలు రాకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జీతాలు లేకుండా పనులు చేస్తారా..? అని ప్రశ్నించారు. పనిచేసిన కాలానికి కూడా వేతనం కోసం పోరాడాల్సిన దుస్థితి రావటం పాలకుల దుర్మార్గపు విధానాలకు నిదర్శనమన్నారు. ప్రత నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుల వారసులకు డైలీ వేజ్ వర్కర్లుగా ఉద్యోగం ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి కార్మికుడికి రెండు జతల యూనిఫామ్ బట్టలు ఇవ్వాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇస్తున్న విధంగా వేతనం రూ. 21,690 రాష్ట్రం మొత్తం అమలు చేయాలని కోరారు.



డీటీడీఓకు వినతిపత్రం అందిస్తున్న హాస్టల్ డైలీవైజ్ వర్కర్స్ నాయకులు

కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కార్మికులను గుర్తించి తమకు న్యాయం చేయాలన్నారు. కార్మికుల డిమాండ్లను పరిష్కారంతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అడ శ్యాంరావ్, ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య, జిల్లా నాయకులు మరప రాంబాయి, బాలకిషన్, ఇట్యాల సంతర్ బాయి, పతుబాయి పాల్గొన్నారు.

రెగ్యులర్ విద్యాశాఖాధికారిని నియమించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్

- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టీకానంద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకు రెగ్యులర్ జిల్లా విద్యాశాఖ అధికారిని నియమించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టీకానంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెల రోజులుగా రెగ్యులర్ జిల్లా విద్యాశాఖ అధికారి లేక విద్య వ్యవస్థ కుంటుపడుతుందన్నారు. గతంలో జిల్లాలో పనిచేసిన జిల్లా విద్యాశాఖ అధికారి ఇతర జిల్లాకు బదిలీ అవ్వడంతో పోస్టు ఖాళీ అయిందన్నారు. డిప్యూటేషన్ ద్వారా వచ్చిన ఓ ఉపాధ్యాయునికి ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి ఇవ్వడంతో జిల్లాలో పర్యవేక్షణ కరువైందన్నారు. కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లడానికి సమయపాలన పాటించడం లేదని, బయోమెట్రిక్ విధానాన్ని కూడా ఉపాధ్యాయులు తప్పుదోవ పట్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇన్‌చార్జి విద్యాధికారిగా ఉన్న అధికారి పాఠశాలలపై పర్యవేక్షణ చేయడం లేదని, మండల విద్యాశాఖ అధికారులకి ఒకరికి నాలుగు మండలాలు ఉండడంతో వారి పర్యవేక్షణ కూడా జరగడం లేదన్నారు. దీంతో విద్యార్థులు పూర్తిగా నష్టపోతున్నారన్నారు. జిల్లాలో రెగ్యులర్ విద్యాశాఖ అధికారి నియమించి పాఠశాలలపై పర్యవేక్షణ జరిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం, శ్రావణి, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా కోశాధికారి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-దహెగాం

మండల అభివృద్ధికి అందరు సమిష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు ప్రజల కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంబగోని సులోచన, స్థానిక ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మీ, పీఏసీఎస్ చైర్మెన్ కోండ్ర తిరుపతి గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బండ కృష్ణమూర్తి, సర్పంచ్‌లు మధూకర్, రమేష్, తహసీల్దార్ కవిత పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన అధికారులు

మండల కేంద్రానికి వచ్చిన సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబును ఎంపీడీఓ రాజేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖ, ఉపాధిహామీ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగేష్, ఏపీఓ కల్పన, పంచాయతీ కార్యదర్శులు ప్రణీత్‌బాబు, సురేష్, రాజేష్, శివ, లత, సౌమ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఎంపీడీఓ, ఉద్యోగులు

కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా

నవతెలంగాణ - బెజ్జూరు

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అర్హులైన లబ్ధిదారుల నుండి ఆరు గ్యారెంటీల పథకాల దరఖాస్తులను గురువారం ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం 13 హామీలను ఆరు గ్యారెంటీల రూపకంగా ప్రజలకు ఎన్నికల్లో వాగ్దానం చేయడం జరిగిందన్నారు. గత సంవత్సరం డిసెంబర్ 28వ తేదీ నుండి ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రజల నుండి ఐదు గ్యారెంటీల అమలుకు లబ్ధిదారుల ఎంపిక నిర్వహణ కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 6వ తేదీ వరకు ఉంటుందని, ఇంకా రెండు రోజులు గడువు ఉన్నందున మిగిలిన వారందరు కూడా దరఖాస్తు చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్సర్ హుస్సేన్, ఉప సర్పంచ్ అడ్డూరి రాజేష్, పంచాయతీ కార్యదర్శి మీసారి వైకుంఠం, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని సరండి, పటగూడ, లేండిగూడ, నవెగావ్ గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరణ కొనసాగుతుంది. గురువారం ఎంపీడీఓ శివకుమార్, తహసీల్దార్ రెహిమొద్దీన్ ప్రజాపాలనను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను గ్రామ పంచాయతీలో అందజేయాలని వారు కోరారు. ఇప్పటివరకు రేషన్‌కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరో రెండు రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేటాయించిన తేదిలో దరఖాస్తు చేసుకోని వారు మరుసటి కూడా సంబంధిత శాఖ అధికారులకు తమ దరఖాస్తులను అందించవచ్చని సూచించారు. సందేహాలుంటే అధికారులను సంప్రదిస్తే నివృత్తి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు

పాదుక దర్శనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కౌటల

మండలకేంద్రంలోని మినీ స్టేడియంలో నరేంద్ర మహారాజ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పాదుక దర్శన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా హారతి ఇచ్చి పూజాది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. ఆధ్యాత్మికతతో ఈర్షాద్వేషాలు ఉండకుండా ఐకమత్యంగా ముందుకెళ్లారన్నారు. నరేంద్ర మహారాజ్ పాదుక దర్శనాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆయన అన్నారు. ఆయన వెంట మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

పేద ప్రజలు, రైతులు, నిరుద్యోగుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధిపొందాలని టీజీబీ బ్యాంకు మేనేజర్ రాజగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రుద్రారం శాఖ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ లోనవెల్లి పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత, ఎంపీ యాక్ట్, సైబర్ నేరాలపై కళాజాత బృందం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు పథకాలు ఇంటి నిర్మాణం, విద్య, బంగారం రుణాలు, సామాజిక భద్రత, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర వాటిపై ఉన్నాయన్నారు. నగదురహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను నేరుగా బ్యాంకు సిబ్బందితో సంప్రదించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అప్పుడే ప్రభుత్వాలు అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని అన్నారు. ఈ యొక్క అవగాహనను మాటలు, పాటలు, మ్యాజిక్ షో ద్వారా కళా బృందం సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కళాజాత బృందం సభ్యులు రాఘవేంద్ర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా విద్యాశాఖ అధికారి ఉదయ బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి ఉదయ బాబు అన్నారు. జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ ఆధ్వర్యంలో సుస్థిర జీవన విధానం అనే అంశంపై గురువారం పట్టణంలో సర్ సిల్క్ ప్రాథమిక పాఠశాలలో కార్యాశాల నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని, కాలుష్యం తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. జీవన శైలిలో మార్పులు వచ్చినప్పుడు మాత్రమే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. పాలిథిన్ ప్లాస్టిక్‌ల నుండి ఉపయోగకరమైన వస్తువుల తాయరీకు సంబంధించిన శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ హరిత దళ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్ రావు, మండల నోడల్ అధికారి దేవాజి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రమీల, జాతీయ హరిత దళం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

6నుంచి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాల అమలుకు ప్రజాపాలన సభలో స్వీకరించిన దరఖాస్తులను ఈ నెల 6 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియకు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆరు గ్యారంటి పథకాల దరఖాస్తులపై పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 28 పంచాయతీల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేకంగా ఓ గదిలో కంప్యూటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రజాపాలన సభల్లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికి విధులు కేటాయించినట్లు తెలిపారు. ఆయా పంచాయతీల్లో ప్రజాపాలన సభల్లో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ చేయించాలని ఎంపీడిఓ ఆదేశించారు. సమావేశంలో డీఎల్పీఓ సురేష్ బాబు, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీఓ గౌరీశంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

6 గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజాపాలన అభయ హస్తం, 6 గ్యారంటీలు అమలు చేసేందుకు స్వీకరిస్తున్న దరఖాస్తులు ప్రతి ఒక్కరు చేసుకోవాలని తహసీల్దార్ వేణుగోపాల్ ఎంపీడీఓ అరుణాని సూచించారు. గురువారం మండలంలోని దేవుని గూడా, బాదంపెల్లి, చింతలపల్లి, తొర్రే గ్రామాల్లో వేరువేరుగా అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఈ నెల ఆరు వరకు తమ దరఖాస్తులను ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం తప్పకుండా ఆరు గ్యారెంటీ స్కీములను అమలు చేసి పేద ప్రజలకు అండగా నిలుస్తుంది అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయ్ కుమార్, ఎంపీఈఓ రమేష్, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముజాఫర్ అలీఖాన్, మేకల మాణిక్యం, దేవుని గూడా, సర్పంచ్ గుర్రం శిరీష, ఎంపీటీసీ మచ్చ పోసవ్వ, శంకరయ్య, టేకుమాట్ల పంకాజ, ముత్యం రాజన్న, మహేష్ యాదవ్, తిరుపతిగౌడ్, తిరుపతి, గూడ శంకరయ్య, గుమ్ముల తిరుపతి, గూడ అశోక్, రాకేష్, సత్తన్న పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని శివ్వారం గ్రామానికి చెందిన తాటిపల్లి సమ్మాగౌడ్ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని అదే గ్రామానికి చెందిన విష్ణుభక్తుల స్వప్న ఆరోపించింది. గత నెల 28న జరిగిన ఈ సంఘటనపై జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొంది. నిందితున్ని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తోంది. గత కొంత కాలంగా అత్తింటి వారికి దూరంగా శివ్వారం గ్రామంలో గల తన పుట్టింటిలో నాలుగు సంవత్సరాల కూతరుతో కలిసి జీవిస్తున్నట్లు తెలిపింది. అనారోగ్యంతో ఉన్న తండ్రి, మానసిక అనారోగ్యంతో గల తల్లిని కూలీ పనులు చేసుకుంటూ పోషిస్తున్నట్లు తెలిపింది. ఒంటరి మహిళగా జీవిస్తున్న తనను వరుసకు అన్నయ్య అయినటువంటి సమ్మయ్య రాత్రి సమయంలో ఇంటిలోకి వచ్చి నా పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆవేధన వ్యక్తం చేసింది. నా పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన సమ్మాగౌడ్‌ను చట్ట పరంగా శిక్షించాలని ఈ సంధర్భంగా పోలీస్ అధికారులను వేడుకుంటోంది. బాధితురాలు పిర్యాదు మేరకు ఇదివరకే కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఉపేందర్ తెలిపారు.

ఎమ్మెల్యే సారు.. సాగు నీరు అందేనా..?

- యాసంగి పంటకు నీరిస్తామనడం హర్షణీయం
- గూడెం లిఫ్ట్ వద్ద రెండు టీఎంసీల నీరు
- గత పాలకుల అవగాహన లేమితో నష్టం
- ముందు చూపు అవసరమంటున్న రైతులు

మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో కడెం ఆయకట్టు రైతుల యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు రోజు వారీ సమీక్షలతో రైతులకు నీరందించే కృషి చేస్తున్నారు. యాసంగి పంటకు సాగు నీరందిస్తామని ప్రకటించడంతో పలు సందేహాలు తలెత్తుతున్నాయి. గత పాలకుల తప్పిదాలతో పంట చివరిదశలో నీరందే పరిస్తితి కానరావడం లేదు. ఇందుకు నిదర్శనం ఎల్లంపల్లిలో సరిపడా నీరు లేదు. కింద సుందిళ్ల నుంచి ఎత్తి పోసే అవకాశం లేదు. గూడెం లిఫ్ట్ ద్వారా రెండు టీఎంసీల నీరు అందితేనే పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఈ నెల 6 నుంచి రభి సాగుకు గూడెం లిఫ్ట్ నుంచి ఆరు తడి పంటలకు సాగు నీరు అందిస్తామని అధికారులు ప్రకటించారు. ఇది ఎంతవరకు సాధ్యం.. ఎందుకంటే ఎల్లంపల్లిలో సరిపడా లేదు. కడెం నుంచి వచ్చే పరిస్తితులు లేవు.. ఎమ్మెల్యే చోరువ తీసుకొని కింద గోలివాడ పంప్ హౌజ్ నుంచి ఎల్లంపల్లికి కనీసం 2టీ ఎంసీల నీరు ఎత్తిపోసే ఏర్పాట్లు చేయాలని నియోజకవర్గ రైతులు కోరుతున్నారు.



ఎల్లంపల్లిలో సరిపడా నీరు లేని దృశ్యం

నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో కడెం ఆయకట్టు రైతుల పరిస్తితి అగమ్యగోచరంగా మారింది. గత పాలకులు ఏండ్ల తరబడి హామీలు ఇవ్వడమే తప్ప పంట పూర్తి కాలం నీరు సరఫరా చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు దండేపల్లి, లక్షెట్టిపెట్, హాజీపూర్ రైతుల బాధలు గత పదేళ్లగా చూస్తూ వస్తున్నారు. గత ఎమ్మెల్యే అసమర్థతతో ఎప్పుడు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందలేదు. పంటలు చివరి దశలో ఎండిపోయి రైతులు నష్టపోయారు. ప్రస్తుతం జనవరి 6 నుంచి కడెం కెనాల్ 30 నుంచి 42వ డిస్ట్రిబ్యుటర్ వరకు యసంగి సాగు నీరు కేవలం ఆరుతడి పంటలకు ఇస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. అధి పూర్తి పంటలకు కాదు.. కేవలం ఆరుతడి పంటలకే అని తెలిపారు. దీంతో వరి సాగు రైతు ఆందోళనలో పడ్డారు. పంట పూర్తి కాలానికి సరి పడా నీరు గూడెం లిఫ్ట్ వద్ద లేదు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేయడంపై రైతులు అయోమయంలో ఉన్నారు. పంట సాటు చేయాలా లేదా అని, కడెం పూర్తిగా ఎండిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గూడెం లిఫ్ట్ ఎన్ని రోజులు ఎత్తిపోస్తుంది అనేది అర్థం కాని పరిస్థితుల్లో రైతులు ఉన్నారు.

ఎంతవరకు నీటి లభ్యత..?

మంచిర్యాల నియోజకవర్గం పరిధిలో కడెం ఆయకట్టు డిస్ట్రిబ్యూటర్ 30 నుంచి 42 వరకు గూడెం లిఫ్ట్ ద్వారా సుమారు రెండు టీఎంసీల నీరు సరఫరా చేస్తేనే 18 వేల ఎకరాల వరకు సాగు నీరందుతుంది. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో కేవలం 14.6 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గూడెం లిఫ్ట్ వద్ద 12 టీఎంసీల నీరు వరకు ఉంటేనే లిఫ్ట్ నడుస్తుంది. ఇప్పుడు 14 టీఎంసీలు వుంటే అందులో హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లాయి, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలకు మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎగువ గోదావరి నుంచి వచ్చే నీరు ఆవిరి రూపంలోనే పోనుంది. ఇక కాలేశ్వరం లింక్‌లో బాగంగా సుంధిల్ల నుంచి ఎత్తిపోయాల్సిన నీరు లేదు. ప్రస్తుతం సుందిల్ల ప్రాజెక్ట్‌లో 2.2 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. మొత్తం 8 టీఎంసీల కెపాసిటీ ఉన్న సుందిల్లా ప్రాజెక్ట్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పిదాలతో కాళేశ్వరం కుంగి పోవడంతో నీటిని ఖాళీ చేశారు. తక్కువలో తక్కువ 5 టీఎంసీల నీరుంటేనే ఎగువ ఎల్లంపల్లి ఎత్తిపోసే అవకాశం ఉంది. ఇప్పుడు గూడెం లిఫ్ట్ నడవాలంటే ఎల్లంపల్లి కింద ఉన్న సుందిల్ల బ్యారేజ్ కోసం ఏర్పాటు చేసిన పార్వతి బ్యారేజ్, గోలివాడ పంప్ హౌజ్ నుంచి మోటార్ల ద్వారా నీటిని పంప్ లా ద్వారా తోడి ఎల్లంపల్లిలో ఎత్తిపోయాలి. కానీ కింద నీరు లేకపోవడంతో ఎల్లంపల్లి ఎత్తిపోసే అవకాశం లేదు. గూడెం లిఫ్ట్ నుంచి నియోజకవర్గ పరిధిలో 15వేల 32 ఎకరాలకు సాగు నీటి కోసం అధి కూడా ఆరుతడి పంటలకు కేవలం కడెం కెనాల్ మెయిన్ రోడ్ వైపునే ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవానికి 30 వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉంటుంది. నీటి లభ్యత లేని కారణంగా 15 వేల ఎకరాలకు కుదించారు. అయిన ఈ 15 వేల ఎకరాలకు చివరి వరకు సగునీరందే పరిస్తితి లేదు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రత్యేక చొడువ తీసుకొని కాళేశ్వరం లింక్ సుందిల్ల, ఎల్లంపల్లి, కడెం ప్రాజెక్టుల అధికారులతో మాట్లాడి సాగు నీరు చివరి వరకు అందించే అవకాశం వుంటేనే రైతులకు భరోసా ఇవ్వలేని పరిస్థితి ఉంది. నీరు ఇవ్వలేని పక్షంలో రైతులకు పరిహారం రూపంలో ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.



సింగరేణి సీఎండీని కలిసిన గిరిజన ఉద్యోగులు



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి సీఅండ్ఎండీగా అదనపు బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ బలరామ్ నాయక్‌ను సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు గురువారం సింగరేణి భవన్‌లో కలిశారు. సింగరేణి సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన బలరామ్ నాయక్‌ను మొదటి సారిగా కలిసిన నాయకులు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎండీ హోదాలో సింగరేణి సంస్థ మరింత ప్రగతి సాధించాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలండర్‌ను సింగరేణి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎండీ బలరామ్ నాయక్‌తో పాటు డైరెక్టర్ సత్యనారాయణ, ఎన్వీకే శ్రీనివాస్, జీ వెంకట్, వెంకటేశ్వర్‌రెడ్డి, హనుమంతు, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రెటరీ సురేష్, గిరిజన ఉద్యోగుల సంఘం చీఫ్ లైసెన్ ఆఫీసర్ కృష్ణయ్య, అసోసియేషన్ అధ్యక్షులు బాస్కర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పంతుల నాయక్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తుల వెల్లువ

నవతెలంగాణ-తాండూర్

మండలంలో చౌటపల్లి నర్సాపూర్ గ్రామపంచాయతీలలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. చౌటపల్లి పంచాయితీలో 245 అభయస్తం దరఖాస్తులు రాగా 244 సాధారణ దరఖాస్తులు వచ్చాయి నర్సాపూర్ పంచాయితీలో అభ్యాసం కోసం 159 మంది దరఖాస్తు చేసుకోగా 57 మంది సాధారణ అవసరాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. చౌటపల్లి పంచాయితీలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో సర్పంచ్ చీమల శంకర్ అధ్యక్షత వహించగా తహసిల్దార్ రోహిత్ టీం లీడర్‌గా వ్యవహరించారు కార్యక్రమంలో జడ్పీటీసీ బానయ్య ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్, ఎంపీటీసీ శ్రీదేవి, రైతు సమన్వయసమితి సభ్యులు మాసాడి తిరుపతి, ఎంపీటీసీ సిరంగి శంకర్, ఏఓ కిరణ్మయి ఏఈ అప్పలనాయుడు, ఎంపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు. నర్సాపూర్ గ్రామపంచాయతీలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో టీం లీడర్ ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఏఈ ప్రభాకర్ డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ దరఖాస్తులను స్వీకరించారు.

వేలాల జాతరకు మంత్రికి ఆహ్వానం



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని వేలాల గ్రామంలో వెలిసిన మల్లిఖార్జున స్వామి ఆలయ జాతరకు రావాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మణ్ ఆహ్వానించారు. ఉప సర్పంచ్ డేగ నగేష్ పటేల్‌తో పాటు గ్రామస్థులు ఇప్పలపల్లి నాగరాజు సహా పలువురు స్థానికులు గురువారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. సుప్రసిద్ది చెందిన శైవ క్షేత్రాల్లో ఒక్కటైన వేలాల మల్లిఖార్జున స్వామి జాతర ఆనవాయితిగా మహా శివరాత్రి పర్వదినం నుంచి మూడు రోజుల పాటు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రం నలుమూల నుంచి తరలివచ్చే భక్తులతో పాటు పక్క రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చే వేలాల జాతరకు అధికారికంగా హాజరు కావాలని కోరారు. అదేవిధంగా మల్లిఖార్జున స్వామి ఆలయంతో పాటు గుట్టపై వెల్సిన గట్టు మల్లన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా నిధుల కేటాయించేలా కృషి చేయాలని కోరినట్లు వారు తెలిపారు.

మెస్, కాస్మోటిక్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టల్లో మెస్ కాస్మోటిక్ బిల్లులు సకాలంలో రాకపోవడంతో హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సంక్షేమ వసతిగృహలు, గురుకుల, కేజీబీవీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచామని ప్రకటించినా అవి అమలు కావడం లేదని పేర్కొన్నారు. గత సంవత్సరకాలం నుంచి హస్టల్స్ మెస్ బిల్లులు కూడా పెండింగ్ ఉన్నాయని, హస్టల్స్ విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు ఉసేలేదని తెలిపారు. పేద విద్యార్థులు తెలంగాణ రాష్ట్రంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని అన్నారు. ప్రభుత్వం పెంచిన మెస్ ఛార్జీలు తక్షణమే అమలు చేయాలని,



పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి ఇవ్వాలని, రాష్ట్రంలో అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కేజీబీవీ, సంక్షేమ వసతిగహాలకు స్వంత భవనాలు నిర్మించాలన్నారు. గత 5 సంవత్సర కాలంగా పెండింగ్ ఉన్న హస్టల్స్ మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయాలని, దుప్పట్లు, యూనిఫామ్స్, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు అందించాలన్నారు. రిపేర్లలో ఉన్న మరుగుదొడ్లు, కరెంటు మరమ్మతులు తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఈదునూరి అభినవ్ పాల్గొన్నారు.

రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత



నవతెలంగాణ-నస్పూర్

ప్రమాదవశాత్తు చనిపోయిన తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారుని కుటుంబానికి రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ కేవీ ప్రసాద్, రీజనల్ మేనేజర్ మురళీ మనోహర్ రావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిల్వేరు సత్తన్న రూ.1000తో ఎస్‌బీఐ జనరల్ ప్రమాద బీమా చేసుకోవడం జరిగిందని, ప్రమాదవశాత్తు నదిలో మునిగి చనిపోయాడని తెలిపారు. ప్రమాదంలో మరణించినందుకుగాను నామిని అయినా భార్య సిల్వర్ సత్తవ్వకు రూ.20 లక్షల చెక్కును అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా ఎస్‌బీఐ జనరల్ ప్రమాద బీమా చేసుకోవాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే నామినీకి రూ.20 లక్షల బీమా సొమ్ము వర్తిస్తుందని తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజేష్ ప్రసాద్, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ప్రసన్నకుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ల ఆవిష్కరణ

జన్నారం : ప్రజాసమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలిచేవి పత్రికలేనని జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఏనుగు సుభాష్‌రెడ్డి, ముత్యం రాజన్న, పసియుల్లా అన్నారు. గురువారం మండల కేంద్రంలో నవతెలంగాణ పత్రిక నూతన సంవత్సర క్యాలెండర్లను, వేరువేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికలు ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రభుత్వానికి తెలిపేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాంతం శంకరయ్య, సిటీ మల భరత్ కుమార్, లచ్చన్న, గంగన్న తిరుపతి రజాక్ పాల్గొన్నారు.

పెద్దనపల్లిలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

కాసిపేట : మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వేముల కృష్ణ అధ్యక్షతన ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. అర్హులైన లబ్ధిదారులు తప్పకుండా దరఖాస్తులు చేసుకోవాలని సర్పంచ్ వేముల కృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మండల ప్రత్యేక అధికారి గంగారాం, తహసీల్దార్ బోజన్న, ఎంపీఓ నాగరాజు, వ్యవసాయ అధికారి వందన, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, ఉప సర్పంచ్ సోమని మైసక్క, ఏపీఎం వెంకటేష్ పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు ప్రభుత్వం చేయూత

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



నవతెలంగాణ-తాండూర్

నిరుపేద మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనందిస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం తాండూర్ మండలం అచులాపూర్‌లో కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కల్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగిస్తూ పెళ్లికూతురుకు తులం బంగారాన్ని ఇచ్చే ప్రయత్నాల్లో ఉందన్నారు. కాంగ్రెస్ మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం రూ.500 కే గ్యాస్ సిలెండర్, రూ.2500 మతి చెల్లించేందుకు పథకాల రూపకల్పన చేస్తుందని తెలిపారు. ఈ నెలాఖరు వరకు మహాలక్ష్మి పథకాన్ని నిరుపేద మహిళలందరికీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం స్థానికంగా నివాసం ఉంటానని తెలిపారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూర్ తహసీల్దార్ రోహిత్, సీనియర్ నాయకులు మురళీధర్‌రావు, మండల అధ్యక్షుడు ఈసా, కిష్టంపేట సర్పంచ్ సార్ల పద్మ అచలాపూర్ సర్పంచ్ దాగాం శంకరమ్మ, రంగి శంకర్, కామని శ్రీనివాస్, మైదం అనిల్ గట్టయ్య మాసాడి తిరుపతి పాల్గొన్నారు.

అర్హులైన లబ్దిదారులకు తప్పక సంక్షేమ ఫలాలు



నవతెలంగాణ-కాసిపేట

అర్హులైన లబ్దిదారులకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా 5 గ్యారంటీల పథకాల ఫలాలు తప్పక అందుతాయని అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. గురువారం మండలం మద్దిమాడ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులైన లబ్దిదారులకు 5 గ్యారంటీల పథకాల ఫలాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని, అధికారుల వద్ద దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయని, దరఖాస్తుదారులు ముందస్తుగానే తమ దరఖాస్తును నింపి గ్రామ సభ వద్దకు రావాలని తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో స్త్రీ, పురుషులకు వేర్వేగా క్యూ లైన్లు, మహిళల కొరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ కౌంటర్లు, తాగునీరు, టెంట్లు, కౌంటర్లకు టేబుళ్లు, క్యూ లైన్లకు బారీకేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గంగారాం, ఎంపీడీఓ ఎంఏ అలీం, సర్పంచ్ ఆడె జంగు పాల్గొన్నారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్న సదరం శిబిరాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శిబిరం నిర్వహిస్తున్నామని, గతంలో పొందిన సదరం సర్టిఫికెట్ కాల పరిమితి పూర్తయిన వారు రెన్యువల్ కోసం నూతన సర్టిఫికెట్ పొందేందుకు అభ్యర్థులు మీ-సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకొని సకాలంలో హాజరు కావాలని తెలిపారు. ఈ నెల 9, 24 తేదీలలో శారీరక దివ్యాంగులు-ఆర్థో(100 మంది), 12, 22 తేదీలలో మూగ, చెవుడు (100 మంది), 19, 31 తేదీలలో కంటిచూపు (60 మంది), 23, 30 తేదీలలో మానసిక దివ్యాంగులు (100 మంది) శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, అర్హులైన అభ్యర్థులు సకాలంలో హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అయ్యప్ప స్వాములకు ముస్లీం విందు

నవతెలంగాణ-జన్నారం

రాంపూర్ గ్రామంలో మత సామరస్యం వెల్లివిరిసింది. గురువారం ముస్లీం సోదరులు అయ్యప్ప స్వాములకు భోజనం పెట్టి ఇతర మతాలపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. పరిసర గ్రామాలకు చెందిన య్యప్ప స్వాములకు జర్నలిస్టుగా పనిచేస్తున్న నిజామొద్దిన్ స్వయంగా వడ్డించారు. ఈ క్రమంలోనే అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయాలని ఆయన భావించారు. తన మతంపై ప్రేమ ఉందని, అదే సమయంలో ఇతర మతాలపైనా గౌరవం ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు దండేపల్లి ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ స్వామి, జడ్పీటీసీ గడ్డం నాగరాణి-త్రిమూర్తి స్వామి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | జనవరి 05, 2023 | www.navatelangana.com

పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పీఆర్టీయూటీఎస్ నూతన సంవత్సర 2024 క్యాలెండర్‌ను బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. గురువారం ఎమ్మెల్యేను నేరడిగొండలో సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, నేరడిగొండ మండల విద్యాధికారి భూమా రెడ్డి, సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కటుకురీ గంగాధర్, సభ్యులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

నవతెలంగాణ-ముధోల్

యూరియా అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ అజ్మీరా భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న విజయలక్ష్మి ఎరువుల దుకాణంలో అధిక ధరలకు యూరియా అమ్ముతున్నారని, రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం వ్యవసాయ అధికారులు విచారణ జరిపారు. అధిక ధరలకు యూరియా అమ్ముతున్నట్లు విచారణలో బయటపడింది. దుకాణంలో నిల్వ ఉన్న ఎరువులను సీజ్ చేసినట్లు ఏఓ చెప్పారు. ఎరువుల దుకాణం లైసెన్స్ రద్దు చేయనున్నట్లు తెలిపారు. ఏవరైన అధిక ధరలకు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ప్రజ శ్రేయస్సు కోసమే పథకాలు

- ఎమ్మెల్యే పాయల శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదల ప్రలజ శ్రేయస్సు కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పథకాలను అమలు చేస్తున్నారని, ఉజ్వల యోజన పథకం కేంద్ర ప్రభుత్వ ప్రధాన పథకాలలో ఒకటని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు గ్యాస్ పొయ్యితో పాటు ఒక సిలిండర్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వెనుకబడిన, పేద వర్గాల మహిళలకు స్వచ్ఛమైన వంట ఇంధనాన్ని అందించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. మహిళలు కట్టెల పొయ్యిపై వంట చేస్తూ పొగతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని ప్రధాని మోడీ అందుబాటులోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో లబ్ధిదారులైన మహిళలు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా గ్యాస్ కనెక్షన్ ఇవ్వటం జరుగుతుందని, దీనికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉన్నారు.

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లోకి డీసీసీబీ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. గురువారం ఆదిలాబాద్ జిల్లాకు చెందిన డీసీసీబీ చైర్మెన్‌తో పాటు జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి, జైనథ్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, పూసాయి సర్పంచ్ అల్లూరి పోతారెడ్డి, గడ్డం జగదీష్ రెడ్డి, గడ్డం పోతారెడ్డి, ఎల్టి భోజరెడ్డి, కృష్ణారెడ్డి, లింగారెడ్డితో పాటు మరికొందరు మంత్రి సీతక్క సమక్షంలో హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారికి సీతక్క సాదారంగా స్వాగతం పలుకుతూ పార్టీ బలోపేతం కోసం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడె గజేందర్, నాయకులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూలో పలువురి చేరిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మడవి గణేష్‌తో పాటు పలువురు పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంలో చేరారు. ముందుగా ఏఐఎస్ఎఫ్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్నారపు రాజేశ్వర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి జగజంపుల తిరుపతి ఆధ్వర్యంలో గణేష్, నాగేందర్, అంబాని, ఆత్రం అశోక్, బండు, యువరాజ్ జలపత్, విట్టల్ విద్యార్థి సంఘంలో చేరారు. వారికి సంఘం కండువా కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్నారపు రాజేశ్వర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి జగజంపుల తిరుపతి మాట్లాడుతూ పీడీఎస్‌యూ సంస్థగత ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి సంఘంలో చేరడాన్ని రాష్ట్ర కమిటీగా స్వాగతిస్తున్నామన్నారు. జిల్లాలో మరింత నిర్మాణాత్మకంగా విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, జిల్లాలో విద్యారంగ సమస్యలు అనేకంగా ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎర్రజి హరీష్, నాయకులు శ్రీకర్ పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని పిప్పరవాడ లోట్ ప్లాజా వద్ద మాట్కా నిర్వహకులను సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ సాయినాథ్, జైనథ్ సీఐ కోల నరేష్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. గురువారం టోల్ ప్లాజా వద్ద మట్కా నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు అశోక్ సామ్రాట్, గోలురాయ్‌లతో 9 మంది మడావి జంగు, మెట్‌పల్లి పరమేశ్వర్, షేక్ ఇమ్రాన్, రమేష్, షేక్ సమీర్, అనిల్ కుమార్, వింష్ల రెడ్డి, ఉత్తమ్, కరణ్ మట్కా జుదరులులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 30,470 నగదు, 7 సెల్ ఫోన్లను, రెండు ద్విచక్రవాహనాలు, ఒక ఆటో స్వాదీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ సాయినాథ్ తెలిపారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-తాంసి

తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని బండల్‌నాగపూర్ నుండి కప్పర్ల, సవర్గాం వరకు ఆర్అండ్‌బీ నిధులు రూ. కోట్లతో మంజూరై బీటీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేశారు. గ్రామానికి తొలిసారి వచ్చిన ఆయనకు గ్రామస్తులు, పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రామ మందిరంలో పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఎండ్లుగా రోడ్డు దుస్థితి ఎంతో అధ్వానంగా ఉండడంతో కప్పర్ల గ్రామస్తులు రోడ్డు నిర్మాణం కోసం రాస్తారోకోలు చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. రోడ్డు నిర్మాణానికి రూ. 12 కోట్ల నిధులు మంజూరయ్యాని తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయించడం జరుగుతుందన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని తెలిపారు. అనంతరం భీంపూర్ మండల కేంద్రంలో ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు ఇబ్బంది కలగకుండా దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను కోరారు. అక్కడి నుంచి ధనోర గ్రామానికి చెందిన గోప రాజన్న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకన్న, లింబాజి, జెడ్పీటీసీ రాజు, సుధాకర్, ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడ్డి, సంతోష్, కన్వీనర్లు నాగయ్య, అరుణ్, నాయకులు లస్మన్న, మహేందర్, సదానందు, భారత్, వెంకట్ రెడ్డి, గోవర్ధన్ యాదవ్, అనిల్ పాల్గొన్నారు.

పాలకులం కాదు.. ప్రజల సేవకులం

- కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఖానాపూర్

తాము పాలకులం కాదని, ప్రజలకు సేవ చేసే సేవకులమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఖానాపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. అందరి సహకారంతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా తప్పులు చేయబోమని ప్రజల పక్షాన ఉండి పనిచేస్తామని అన్నారు. నియోజకవర్గంలో కొందరు అధికారులు తమకు సహకరించడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యలను ఎప్పటికీ అప్పుడే పరిష్కరించాలని అన్నారు. అంతేకాకుండా ఓ పార్టీకి సంబంధించిన నాయకులు సోషల్ మీడియా వేదికగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎవరు ఏమనుకున్నా పట్టించుకునేది లేదని, ప్రజలతో ఉంటూ ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్, తహసీల్దార్ పరిమళ భౌమిక, ఆర్ఐ రాజేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కడార్ల గంగ నర్సయ్య పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తా

- ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి పెద్ద పీట వేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో హోమం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలకు కష్టసుఖాల్లో ఎల్లవేళల అందుబాటులో ఉండి అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తానని అన్నారు. వారంలో మూడు రోజులు ముధోల్ క్యాంపు కార్యాలయంలో, మరో మూడు రోజులు బైంసాలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

బాసర అమ్మవారి ఆలయాన్ని యాదాద్రి తరహలో ఆలయం మాదిరిగా అభివృద్ధి చేసేందుకు కషి చేస్తానని తెలిపారు. అలాగే బాసర ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ముందు ఉంటానని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. అలాగే విద్య, వైద్య సాగునీరుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. బైంసా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సరిపడే మందు బిల్లలు, డాక్టర్లు, నర్సులు లేరని వెంటనే ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందే విధంగా చూస్తానని భరోసా ఇచ్చారు. అలాగే 27, 28 ప్యాకేజీ పనులను పూర్తయ్యేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గంలోని సుమారు 70 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చేస్తానని అన్నారు. తమపై నమ్మకం ఉంచి అధిక మెజారిటీతో గెలిపించిన ముధోల్ నియోజకవర్గ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యన్నగారి భూమన్న, రావుల రాంనాథ్, నగరం నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు రమేష్, రవి పాండే, నర్సాగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మండల ఇన్‌చార్జి టి.రమేష్, ఎంపీటీసీ భూమేష్, లక్ష్మి నారాయణ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాయల శంకర్ గురువారం అధికారిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించి ప్రవేశించారు. ఇన్నాండ్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే జోగు రామన్న ఈ కార్యాలయం నుంచి అధికారిక కార్యకలాపాలు నిర్వహించారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయనపై బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పాయల శంకర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన సంగతి తెల్సిందే. ఈ మేరకు నూతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అధికారిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా కార్యాలయాన్ని సిద్ధం చేశారు. భవనానికి నూతనంగా రంగులు వేసి, కొత్త కళను తీసుకువచ్చారు. కార్యాలయంలోని సామాగ్రిని సైతం కొత్తగా సమకూర్చారు. ఈ సందర్భంగా గురువారం క్యాంపు కార్యాలయంలో కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజది కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పూజలు నిర్వహించి, ఎమ్మెల్యే దంపతులు కలిసి హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యేకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. క్యాంపు కార్యాలయ మహోత్సవానికి ఎంపీ సోయం బాపురావ్ పాల్గొనగా, శాలువాతో సత్కరించారు. అనంతరం సోయంతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, బీజేపీ నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దీంతో క్యాంపు కార్యాలయం సందడిగా మారింది.

కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ

- పర్యవేక్షిస్తున్న అధికారులు



నవతెలంగాణ-తలమడుగు

జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. గురువారం మండలంలోని రుయ్యాడి, ఝరి పునగుడ, భరంపూర్ గ్రామాల్లో జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి పాల్గొన్నారు. దరఖాస్తుల స్వీకరణను అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి పథకాలు అందించడమే ధ్యేయంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీఓ రమకాంత్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, సర్పంచులు పోతారెడ్డి, పెందుర్ రఘు, భాగీరథబాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ రెడ్డి, పేందుర్ మాధవ్, మాజీ జడ్పీటీసీ బాబన్న, సొసైటీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, లోక ప్రవీణ్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు అశోక్, దివాకర్, వెంకటేష్, బాలాజీ, గాజుల సాంబశివ్, మోహన్ రెడ్డి, రాజు, జైతుపటేల్, రావుల నారాయణ, ప్రమోద్, ప్రతాప్, బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

నార్నూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గ్యారెంటీల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు దరఖాస్తులు చేసుకుంటున్నారు. గురువారం నార్నూర్ మండలంలోని బాబేఝరి, సుంగాపూర్ గ్రామ పంచాయితీ, గాదిగూడ మండలంలోని కుండిసెకుగూడ, కొలమా, కొత్తపెల్లి-జి గ్రామ పంచాయితీలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన ప్రతిఒక్కరు 6వ తేది వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ కావలా రమేష్, డీఎల్పీఓ భిక్షాపతి గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి రామేశ్వర్, తహసీల్దారులు రాజలింగం, విజయనందం, ఏఓలు గణేష్ రాథోడ్, రమేష్, ఏఈఓలు శుభాని, శ్రీనివాస్, ఇన్‌చార్జీ ఎంపీఓ గంగాసింగ్, సాయి ప్రసాద్, సర్పంచులు కైలేశ్వరి సాగర్, జీజాబాయి ప్రేమ్, కార్యదర్శులు రాంసింగ్, విజయ్ కుమార్, ముఖేష్, ఏఈఓ నరేష్, ప్రధానోపాధ్యాయుడు న్యానేశ్వర్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఇంద్రవెల్లి : మండలంలోని ధనోర-బి, అంజి, దొడంద, ఇంద్రవెల్లి తదితర పంచాయతీలో గురువారం ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఉదయం నుంచే దరఖాస్తుల సమర్పించేందుకు జనాలు బారులు తీరారు. ఇంద్రవెల్లిలో ఎంపీపీ పి.శోభా, సర్పంచ్ కోరెంగ గాంధారి, అధికారులు పాల్గొన్నారు.

కందికుప్ప దగ్ధం చేసిన వారిపై ఫిర్యాదు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని అర్లి-కే గ్రామానికి చెందిన రైతు కత్రాజి కృష్ణస్వామికి చెందిన కంది పంట చేనులో కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు డిసెంబర్ 31న నిప్పంటించారు. బోరు బావిలో రాళ్ల వేసి విద్యుత్ మోటారు సర్వీస్ వైర్‌ను తీసుకెళ్లారు. ఈ విషయమై బాదిత రైతు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని రైతు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఎమ్మెల్యేను సన్మానించిన సెకండ్ ఏఎన్ఎంలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సెకండ్ ఏఎన్ఎంల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయల్ శంకరను సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. నేషనల్ హెల్త్ మిషన్ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు ఏఎన్ఎంలు పనిచేస్తున్నారని, వారందరినీ రెగ్యులర్ అయ్యేవిధంగా చూడాలని కోరారు. 20 సంవత్సరాల నుండి చాలీచాలని వేతనంతో పాటు పనిభారాన్ని మోస్తూ సేవలందిస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న వైద్యులందరికీ రెగ్యులర్ చేసి తమను విస్మరించారన్నారు. ప్రాణాలకు తెగించి కరోనా సమయంలో సేవలందించిన తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరాగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు జే.పద్మ, సుజాత, పి.పుష్పలత, జానాబాయి, లత, ఎండి.నఫీజా, ప్రమీల పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల పంపిణీ

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామం బీసీవాడలో అయోధ్య నుండి వచ్చిన శ్రీ రాముని అక్షింతలు భక్తులు గురువారం పంపిణీ చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసినంతరం రామ నామస్మరణతో వాడవాడలో ప్రజలకు అక్షింతలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మార్కెట్ కమిటీ చైర్మెన్ కోటగిరి విశాల్, ఆలయ కమిటీ సభ్యులు శివాజీ, గంగాధర్, పాచంగే చంద్రకాంత్ ఉన్నారు.